సాలూరు మున్సిపల్ కమిషనర్ నియామకం


పార్వతీపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా టీటీ రత్నకుమార్ నియామక మయ్యారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆయన్ని సాలూరు కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది.

పార్వతీపురంలో..

పార్వతీపురం టౌన్: సీడీఎం కార్యాలయంలో (గుంటూరు) రిపోర్టు చేయాలని పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ స్థానంలో మరో అధికారిని తాత్కాలికంగా నియమించనున్నారు.

నారుకు నీరేదీ?





- చినుకు లేక.. సాగునీరు అందక..
- ఎండుతున్న నారుమడులు
- వేసవిని తలపిస్తున్న ఎండలు
- ముఖం చాటేసిన వరుణుడు
- ఆందోళనలో రైతన్నలు

పాలకొండ, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ రైతులకు ప్రకృతి సహకరించడం లేదు. ఒకవైపు వర్షాలు లేక.. సాగునీరు అందక.. మరోవైపు వేసవిని తలపించేలా ఎండలతో వరి నారు, ఎదలు, నాట్లు ఎండిపోతున్నాయి. ఇంజన్లు పెట్టి నీరు తోడుదామన్న చెరువుల్లో చుక్క నీరు కూడాలేదు. దీంతో జిల్లాలో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నారు మళ్లను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతు న్నారు. ఇప్పటికే పచ్చని పంటలతో ఖరీఫ్ కళకళలాడాల్సి ఉంది. ఎరువులు వేసుకోవడం, కలుపు నివారణ మందులు పిచికారీ చేయడంలో జిల్లా రైతులు బిజీగా ఉండాల్సింది. కానీ, వర్షాలు లేక.. కాలువల ద్వారా సాగునీరు అందక ఆగస్టు మొదటివారం గడుస్తున్నా ఇంకా చాలాచోట్ల నాట్లు పడలేదు. మేఘాలు ఊరిస్తున్నాయే తప్ప వర్షాలు కురవడం లేదు. ఉభాలు సీజన్ కూడా దాటి పోవడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో అడపాదడపా పడిన వానలకు రైతులు ఎదలు, నాట్లు వేశారు. ఇప్పుడు వర్షాలు ముఖం చాటేయడంతో అవి ఎండిపోతున్నాయి.



ఓనిలో పంట దక్కించుకునేందుకు పైపులతో గెడ్డ నీరు మళ్లిస్తున్న దృశ్యం

పాలకొండ మండలం వెలగవాడలో నర్రలు చాచిన ఎద పంట

ఇదీ పరిస్థితి..

జిల్లాలో ప్రస్తుతం ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. మండుతున్న ఎండలకు తోడు ఉక్కపోత తోడవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అడపాదడపా అవుతున్న ఉబాల పనులను కూడా రైతులు చేయలేకపోతున్నారు. గత వారం రోజులుగా జిల్లా అంతటా 36 డిగ్రీల దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వారం రోజుల కిందట కురిసిన కొద్ది పాటి వర్షాలతో పాటు ప్రాజెక్టుల ద్వారా విడుదలైన సాగునీటితో రైతులు హడావుడిగా ఉబాలు ప్రారంభించారు. అయితే మళ్లీ ఎండల తీవ్రత పెరగడంతో కొన్నిచోట్ల పంటపొలాలు బీటలు వారుతున్నాయి. కొన్నిచోట్ల వేసిన నాట్లు పూర్తిగా కుంగిపోయే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో కొంతమంది రైతులు ఎద పద్ధతిలో సాగు చేశారు. అయితే నీటితడి లేకపోవడంతో అవి కూడా ఎండిపోతున్నాయి. పంట పొలాల్లో నీరు లేకపోవడంతో కలుపు కూడా ఏపుగా

(మిగతా 8వ పేజీలో...)

మన్యం స్వరూపం మారుతుందా?

- జిల్లాల పేర్లు మార్పు, నియోజకవర్గాల విలీనానికి అవకాశం
- నెలలో ఈ ప్రక్రియ పూర్తిచేయాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశం
- మంత్రి వర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు
- జిల్లా రూపురేఖల మార్పుపై జోరుగా చర్చలు

పార్వతీపురం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా స్వరూపం మారనుందా..? నియోజకవర్గాల విలీనంతో పాటు మండలాల చేర్పులు, మార్పులకు అవకాశం ఉందా..? అంటే అవుననే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన మంత్రి వర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొన్ని జిల్లాల పేర్లు మార్పు, పలు నియోజక వర్గాలు పక్క జిల్లాల్లో విలీన ప్రక్రియ ప్రతిపాదనలు నెలరోజుల్లో పూర్తికావాలని సీఎం ఆదేశించారు. దీంతో మన్యం జిల్లా రూపురేఖలు మారే అవకాశం ఉందనే చర్చలు జోరుగా సాగుతున్నాయి.



ఇదీ పరిస్థితి..

- జిల్లాల విభజనకు ముందు పార్వతీపురం డివిజన్ పరిధిలో 15 మండలాలు, సాలూరు, బొబ్బిలి మున్సిపాల్టీలు ఉండేవి. బొబ్బిలి తెర్లాం, బాడంగి మండలాలు కూడా ఈ డివిజన్‌లోనే ఉండేవి. అయితే కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత బొబ్బిలి నియోజకవర్గాన్ని విజయనగరం జిల్లాలో చేర్చారు. ఇక సాలూరు, కురుపాం, పార్వతీపురం, పాలకొండ నియోజవర్గాలతో పాటు కేవలం 15 మండలాలతోనే నాటి ప్రభుత్వం మన్యం జిల్లాను ఏర్పాటు చేసింది. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న పాలకొండ నగరపంచాయతీ, భామిని, సీతంపేట, వీరఘట్టం మండలాలను మన్యం జిల్లాలో కలిపారు.
- గత వైసీపీ ప్రభుత్వం హడావుడిగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే రాజకీయ ఒత్తిడి కారణంగా సాలూరు నియోజక వర్గంలోని మెంటాడ మండలాన్ని విజయనగరం జిల్లాలో చేర్పించారు. సంక్షేమ పథకాల అమలు, సరిహద్దు సమస్యలు తదితర కారణాల రీత్యా కూటమి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో మెంటాడ మండలం తిరిగి సాలూరు నియోజకవర్గంలో కలిసే అవకాశం ఉంది. అదేవిధంగా బొబ్బిలి నియోజకవర్గం తిరిగి మన్యం జిల్లాలో చేరనున్నట్లు వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

- నాయీ బ్రాహ్మణులకు శుభవార్త

పార్వతీపురం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాయీ బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. గతంలో నాయీ బ్రాహ్మణులకు టీడీపీ ప్రభుత్వం ఉచితంగా పనిముట్లు అందించింది. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కారు వాటికి మంగళం పాడేసింది. తాజాగా కూటమి ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలో నాయీ బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. షాపులు నిర్వహించే వారికి నెలకు సుమారు రూ.1200 నుంచి రూ.1300 ఆదా అవుతుందని వారు భావిస్తున్నారు. జిల్లాలో సుమారు 350 నుంచి 400 వరకు సెలూన్ షాపులున్నాయి. కాగా నెలకు సుమారు రూ.4.5లక్షల వరకు ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందని అధికార వర్గాలు తెలియజేస్తున్నాయి.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

నాయీ బ్రాహ్మణుల సెలూన్ షాప్‌లకు ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రకటించడం చాలా ఆనందంగా ఉంది. విద్యుత్ బిల్లులు కట్టలేక చాలా మంది షాపులు మూసివేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నాయీ బ్రాహ్మణులకు అండగా నిలబడిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- డి.రమేష్, సెలూన్ షాప్ యజమాని, పార్వతీపురం

చేనేతలకు చంద్రన్న కానుక

- ఉచిత విద్యుత్ ప్రకటనతో ఆనందం
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

6లో



సంస్కృతం.. ప్రాచీన భాష

- ఇతర దేశాల్లోనూ ఈ పదాల మూలాలు
- నేటి నుంచి సంస్కృత భాషా వారోత్సవాలు



6లో

పంద్రాగస్టు కోసం మాక్‌డ్రిల్

6లో

ఫారెస్ట్ ఉద్యోగాలకు దరఖాస్తు ఎలా?

6లో

డీ వార్మింగ్ డేకు సన్నద్ధం

- డీఎంహెచ్‌వో భాస్కరరావు



వైద్య సిబ్బందికి ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో

పార్వతీపురం, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈ నెల 12న నిర్వహించనున్న డీ వార్మింగ్ డే (నులిపురుగుల నివారణ దినోత్సవం)కు సన్నద్ధం కావాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు ఆదేశించారు. పిల్లలతో తప్పనిసరిగా ఆల్‌బెండాజోల్ మాత్రలు వేయించాలన్నారు. బుధవారం తన కార్యాలయంలో వైద్య సిబ్బందికి ఆల్‌బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ' ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలు, విద్యార్థులకు అంగన్‌వాడీ, పాఠశాల, కళాశాలల్లో మాత్రలు వేయించాలి. చిన్నారులకు సగం మాత్ర, రెండు, మూడేళ్ల పిల్లలకు పూర్తి మాత్ర నీటితో ఇవ్వాలి. మూడు నుంచి 19 సంవత్సరాల వారు పూర్తి మాత్ర నమిలేలా చూడాలి. 20న మాప్ అప్ కార్యక్రమం నిర్వహించాలి.' అని తెలిపారు. ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు మాట్లాడుతూ.. జిల్లాకు 2,13,000 ఆల్‌బెండాజోల్ మాత్రలు సరఫరా అయ్యాయని, 1,96,612 మందితో మాత్రలు వేయిస్తామని చెప్పారు.

ఇంటర్ అడ్మిషన్లు పెంచాలి

- ఆర్జేడీ ఆదినారాయణ

బెలగాం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచాలని ఇంటర్మీడియట్ విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) మజ్జి ఆదినారాయణ ఆదేశించారు. బుధవారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీఐఈవో వై.నాగేశ్వర రావు ఆధ్వర్యంలో ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' ఈ నెల 11తో మూడో విడత అడ్మిషన్ల షెడ్యూల్ ముగియనుంది. ఈ నేపథ్యంలో అడ్మిషన్ల పెంపుదలపై దృష్టి సారించాలి. వారంతపు పోటీ పరీక్షలను పక్కందీగా నిర్వహించాలి. పరీక్ష పేపర్ల మూల్యాంకనం చేసి మార్కులను ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. సిబ్బంది విధిగా ఉదయం, సాయంత్రం తప్పని సరిగా ముఖ ఆధారిత హాజరు వేయాలి.' అని తెలిపారు. పార్వతీపురం జూనియర్ కళాశాలలో రోజూ సాయంత్రం విద్యా శక్తి కార్యక్రమం ద్వారా చెన్నై ఐఐటీ ప్రొఫెసర్ల ద్వారా ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.



ప్రిన్సిపాళ్లతో మాట్లాడుతున్న ఆర్జేడీ ఆదినారాయణ

అగ్రిగోల్డ్ టేకు చెట్లపై నివేదికలు పంపండి

- సబ్ కలెక్టర్ శ్రీవాత్సవ

కొమరాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న టేకు చెట్ల వివరాలపై త్వరగా నివేదికలు అందించాలని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించారు. బుధవారం చోళపదం, ఉలిపిరి పంచాయతీల పరిధిలో ఉన్న అగ్రిగోల్డ్ భూములు, టేకు చెట్లను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి పలు వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ.. స్థానిక రైతుల జిరాయితీ భూములు అగ్రిగోల్డ్ భూములుగా ఆన్‌లైన్‌లో నమోదై ఉన్నాయన్నారు. ఆయన వెంట సీఐడీ, అటవీశాఖ అధికారులు , సర్వేయర్ వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

స్త్రీశక్తికి గ్రీన్‌సిగ్నల్

- 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- ఆమోదం తెలిపిన మంత్రి వర్గం



పార్వతీపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి కూటమి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 15 నుంచి దీనిని ప్రారంభించాలని మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయించారు. ఈ మేరకు సంబంధిత అధికారులంతా ఏర్పాట్లలో తలమునకలయ్యారు. తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ మేరకు పథకాన్ని పట్టాలెక్కించేందుకు పంద్రాగస్టును ముహూర్తంగా నిర్ణయించారు. జీరో ఫెయిర్ టిక్కెట్లు ఎలా ఇవ్వాలనే దానిపై ఇప్పటికే డిపోల్లో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కాగా జిల్లాలో మొత్తం 240 ఆర్టీసీ బస్సులున్నాయి. పార్వతీపురం డిపో కేంద్రంగా 56 ఆర్టీసీ, 33 అద్దె బస్సులు నడుస్తున్నాయి. సాలూరు డిపోలో ఆర్టీసీవి 48 , అద్దె బస్సులు 23 వరకూ ఉన్నాయి. పాలకొండ డిపోలో ఆర్టీసీకి చెందిన బస్సులు 58 , అద్దెవి 22 ఉన్నాయి. జిల్లాలో మరో 40 బస్సుల వరకూ అవసరం అవుతాయని అధికారులు అంచనా వేసి పంపించారు. అవసరమైతే పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా నడుపుతున్న 12 బస్సులను కూడా 'స్త్రీశక్తి'కి వినియోగించనున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు అందుబాటులో ఉంచుతూ మిగిలిన సమయాల్లో మహిళలకు

(మిగతా 8వ పేజీలో...)



60 ప్యాకెట్లు.. 133 కిలోలు

- గంజాయిని పట్టుకుని.. ఆటో సీజ్ చేసిన పోలీసులు
- అల్లూరి జిల్లాకు చెందిన ఇద్దరి అరెస్ట్





పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు (ఇన్‌సెట్లో) వివరాలు తెలియజేస్తున్న ఏఎస్పీ అంకితా సురాన

సాలూరు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట మండలం మాతూమూరు వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవే మీదుగా విజయనగరం వైపు ఆటోలో తరలిస్తున్న గంజాయిని పోలీ సులు పట్టుకున్నారు. అల్లూరి జిల్లాకు చెందిన ఇద్దర్ని అరెస్ట్ చేశారు. బుధవారం సాలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్పీ అంకితా సురాన తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ ఆధ్వర్యంలో పాచిపెంట ఎస్.ఐ వెంకటసురేష్, సిబ్బంది మాతుమూరు వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవేలో వాహనాల తనిఖీ చేపట్టారు. అల్లూరి జిల్లా నుంచి మాతుమూరు సమీపంలో వేటగానివలస జంక్షన్‌కు వచ్చిన ఆటోను ఆపారు. దానిని విస్తృతంగా తనిఖీ చేయగా.. ఆటో సీటు కింద 60 ప్యాకెట్లలో 133 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆటోను సీజ్ చేసి అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ

(మిగతా 8వ పేజీలో...)

చేనేతలకు చంద్రన్న కానుక

● కార్మికుల ఇళ్లలో కొత్త కాంతులు ● ఉచిత విద్యుత్ ప్రకటనతో ఆనందం ● మేలు చేసే నిర్ణయమని అభిప్రాయం ● నేడు జాతీయ చేనేత దినోత్సవం





మగ్గంపై నేస్తున్న చేనేత కార్మికురాలు

రాజాం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన చేనేత కుటుంబాలకు అండగా నిలబడాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తీవ్ర నిరాశా నిస్పృహల మధ్య కొట్టుమిట్టాడుతున్న చేనేత కార్మిక కుటుంబాలకు తీపి కబురు చెప్పింది. గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు వారి ఇళ్లకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌కు 500 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను ప్రకటించింది. ఈ నెల 1 నుంచే అమలులోకి వచ్చేలా ఆదేశాలు జారీ చేసింది. సమన్వయం చేసుకునే బాధ్యతను చేనేత, జౌళి శాఖ అధికారులకు అప్పగించింది. ప్రధానంగా ఉచిత విద్యుత్‌కు సంబంధించి గతంలో ఉన్న ఆంక్షలను సడలించింది. గతంలో చేనేత కార్మికుల ఇళ్లకు 100 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేసేవారు. ఆ పరిమితి దాటి 101 యూనిట్లు వస్తే మొత్తం బిల్లు చెల్లించాల్సిన పరిస్థితి నేతన్నలకు ఎదురయ్యేది. ప్రస్తుత ప్రభుత్వం ఆ పద్ధతికి స్వస్తి పలికింది. 200 యూనిట్ల వరకూ ఉచితం. ఆపై వినియోగించిన యూనిట్లకు మాత్రమే ఛార్జీలు చెల్లిస్తే సరిపోతుందని తెలిపింది. ఇదే నిబంధన పవర్‌లూమ్‌కు వర్తింపజేస్తోంది. ఈ ప్రభుత్వం చేనేతల ఫించన్‌ను రూ.2750 నుంచి రూ.4 వేలకు పెంచింది. త్రిఫ్ట్ పథకాన్ని పునరుద్ధరించింది. త్వరలో ఈ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

● ఆనందోత్సాహంలో నేతన్న..

రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో చేనేతల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. ఉచిత విద్యుత్ ప్రకటనతో పాటు ఇళ్లకు సంబంధించి కూడా అమలు చేసిన విధానానికి స్వస్తి పలకడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా చేనేత కార్మికులంతా తమ ఇళ్లల్లోనే మగ్గాలను ఏర్పాటు చేసుకుని నేయడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి మగ్గం వద్ద ఒకటి నుంచి రెండు విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాల్సి వస్తోంది. దీంతో విద్యుత్ వినియోగం భారంగా పరిణమిస్తోంది. దీంతోపాటు చేనేత కార్మికుల పరిస్థితి కూడా ఆశాజనకంగా ఉండడం లేదు. తాత, తండ్రుల నుంచి వస్తున్న వృత్తిని వదులుకోలేక... ప్రస్తుత పరిస్థితుల్లో కొనసాగించలేక ఆర్థిక భారంతో సతమతమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడతో చేనేత కుటుంబాలలో భవిష్యత్తుపై ఆశలు రేకెత్తుతున్నాయి.

● జిల్లాలో రాజాం, గుర్ల, రామభద్రపురం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల పరిధిలోని రాజాం, పెనుబాక, బొద్దాం, కొప్పర, మందరాడ, బొద్దూరు, రేగిడి, లింగాలవలస, కోటగండ్రేడు తదితర గ్రామాలలో అత్యధికంగా చేనేత కార్మిక కుటుంబాలు ఉన్నాయి. వీరిలో సుమారు 3 వేల మంది వరకూ చేనేత కార్మికులు అనాదిగా వస్తున్న మగ్గాలపై నేతనేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా వీవర్స్ సొసైటీలు, ఆప్కోల నుంచి నూలు తీసుకుని వాటితో దుప్పట్లు, లుంగీలు, తానులు, షర్టింగ్ క్లాత్ నేస్తారు. తయారైన వస్త్రాలను చేనేత కార్మికుల నుంచి ఆప్కో కొనుగోలు చేస్తుంది. ఈ ప్రక్రియలో వీరికి దినసరి కూలీ కూడా లభ్యం కావడం లేదని అంటున్నారు. దశాబ్దాలుగా వంశపారంపర్యంగా వస్తున్న నేతను నమ్ముకున్న వీరంతా మరోపని చేయలేక మగ్గాలపై మగ్గిపోతున్నారు.

ఉచిత విద్యుత్‌తో లాభం..



మా ఇళ్లకు, మగ్గాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. నెలలో పది రోజులు పని ఉంటే.. మరో పదిరోజులు ఖాళీగా ఉంటాం. వచ్చే ఆదాయం కూడా అంతంత మాత్రమే. కుటుంబాన్ని పోషించుకోవడమే భారంగా ఉంది. ఇలాంటి కష్టకాలంలో ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడం వల్ల మా చేనేత కుటుంబాలకు ఎంతో మేలు కలుగనుంది.

-చిన్నమ్మడు, చేనేత కార్మికురాలు, రాజాం

ఆ పథకాలతో ఆనందం..

రాజాం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేత కార్మికుల కోసం త్రిఫ్ట్ పథకాన్ని పునరుద్ధరించింది. నేతన్నలు తమకు వచ్చే ఆదాయంలో 8 శాతాన్ని డిపాజిట్‌చేస్తే..దానికి 16 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం కలుపుతుంది. 90 రోజుల్లో ఆ మొత్తం చేనేత కార్మికుడికి అందుతుంది. ఉదాహరణకు కార్మికుడు రూ.2 వేలు డిపాజిట్ చేస్తే ప్రభుత్వం రూ.4 వేలు కలుపుతుంది. మూడు నెలల్లో మొత్తం రూ.18 వేలు అందిస్తుందన్న మాట. 2014 నుంచి 2019 వరకూ ఈ పథకం అమలైంది. అప్పట్లో ఈ పథకంలో 150 మంది వరకూ నమోదయ్యారు. ఆర్థికంగా లబ్ధి పొందారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పథకాన్ని నిలిపివేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది.

చేనేతశాల ఏర్పాటుకు నిర్ణయం..

మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరిలో చేనేత కార్మికులు అధికం. లోకేష్ చొరవతో అక్కడ చేనేత శాల ఏర్పాటుచేశారు. అటువంటి చేనేత శాల జిల్లాలో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రాజాం మండలం పెనుబాక సరైన ప్రాంతమని ఎంపిక చేశారు జిల్లా చేనేత జౌళి శాఖ అధికారులు. ఇది కార్యరూపం దాల్చితే చాలా మంది కార్మికులకు ఉపాధి మెరుగుపడే అవకాశం ఉంది. యూనిట్ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి మేలు జరగనుంది. ఇంటి వద్ద మగ్గం ఏర్పాటు చేసుకోలేకపోయిన వారు ఇక్కడ ఉపాధి పొందవచ్చు. దేశంలో దిగ్గజ పరిశ్రమల నుంచి ఆర్డర్లు వచ్చేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుంది.

ఉచిత విద్యుత్‌తో ఊతం..

మర మగ్గాలకు నెలకు 500 యూనిట్లు, సాధారణ మగ్గాలకు 200 యూనిట్లు ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో ఎక్కువగా మర మగ్గాలు వినియోగించడం లేదు. సాధారణ మగ్గాలపైనే నేస్తున్నారు. ప్రస్తుతం 750 కుటుంబాల వారు ప్రతినెలా 200 యూనిట్లలోపే విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. వీరికి ప్రతి నెలా రూ.500 నుంచి రూ.800 వరకూ విద్యుత్ బిల్లు వస్తోంది. ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తుండడంతో ప్రతి కుటుంబంపై ఏడాదికి రూ.6 వేల నుంచి రూ.9 వేల వరకూ భారం తగ్గనుంది. జిల్లాలో చేనేత రంగానికి రూ.72 లక్షల వరకూ ప్రయోజనమని జౌళిశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

శుభ పరిణామం..

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే చేనేత కార్మికులను పట్టించుకుంటోంది. ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించడం శుభ పరిణామం. చేనేత సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలి. చేనేత మార్కెటింగ్, రవాణా సదుపాయం కల్పించాలి. ముఖ్యంగా భారంగా మారిన పన్నుల బాధ నుంచి విముక్తి కలిగించాలి.

-చిన్నారావు, చేనేత కార్మికుడు, పెనుబాక, రాజాం

చేనేత శాలను ఏర్పాటు చేయాలి..

పెనుబాకలో చేనేత శాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. వీలైనంత త్వరగా దానిని పూర్తిచేయాలి. పవర్‌లూమ్స్ చేనేత ఉత్పత్తుల తయారీని నియంత్రించాలి. చేనేతరంగంలో తయారైన వస్త్రాలను ప్రభుత్వమే ప్రోత్సహించాలి. పన్నుల భారం నుంచి తప్పించి.. పూర్వవైభవం వచ్చేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలి.

-లక్ష్మణరావు, చేనేత కార్మికుడు, వస్త్రపురి కాలనీ, రాజాం

వందో నెంబర్ చీరలకు చిరునామా..

● ఇదీ నారాయణపురం ప్రత్యేకత

నూరో నెంబర్ చీరలు నేస్తున్న చేనేత కార్మికులు

బలిజిపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన వందో నెంబర్ చీరల నేతలో నారాయణపురానిది ప్రత్యేక స్థానం. నారాయణపురం గ్రామంలో దశాబ్దాల నుంచి సుమారు 180 కుటుంబాలు చేనేత మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరంతా 40, 60, 80 రౌండ్ చీరలు, పంచెలు తయారు చేస్తూ వస్తున్నారు. కాలక్రమేణా వస్తున్న మార్పులకు అనుగుణంగా వందో నెంబర్ చీరలపై దృష్టి పెట్టి ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు. వందో నెంబర్ చీరల తయారీ కష్టంతో కూడుకున్నప్పటికీ ప్రజల ఆలోచనలకు అనుగుణంగా తయారు చేస్తున్నామని చేనేత కార్మికులు తెలిపారు. వందో నెంబర్‌తో పాటు చిత్రిక, జెమ్దాని రకాలు నేస్తున్నట్టు తెలిపారు. వీటి ధర అధికంగా ఉంటుందన్నారు. చిత్రిక, జెమ్దాని చీరలు చేసిన వారికి నెలకు రూ.30 వేల నుంచి రూ.35 వేలు వస్తుందని కార్మికులు తెలిపారు. వీటికి ఇతర రాష్ట్రాల్లో మంచి గిరాకీ ఉంది. వందో నెంబర్ వస్త్రాలు, ఆప్కో, మాస్టర్స్ వీవర్స్ విక్రయిస్తున్నట్టు కార్మికులు తెలిపారు. ప్రభుత్వం మరింత సాయాన్ని అందిస్తే కొత్త చేనేత రకాలను తయారు చేయడానికి వీలు కలుగుతుందన్నారు.



మగ్గంపై పనిచేస్తున్న కార్మికుడు

ఆర్థిక భారం తగ్గుతుంది..



ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇస్తున్న రాయితీ విద్యుత్ కారణంగా ఆర్థిక భారం తగ్గనుంది. దీని ద్వారా కుటుంబ అవసరాలు, పిల్లల చదువులకు తోడ్పాటు అందుతుంది. విద్యుత్ బిల్లుల కోసం అప్పులు చేయాల్సిన అవసరం తగ్గనుంది. వందో నెంబర్ వస్త్రాలు తయారు చేసిన తర్వాత ఆర్థికంగా బాగున్నాం.

-బల్ల సత్యవతి, చేనేత కార్మికురాలు

ప్రభుత్వ సహకారం అవసరం..



చేనేత కార్మికులకు ప్రభుత్వం సహకరిస్తే మరింత అభివృద్ధి సాధించగలం. మేం తయారు చేసిన వస్త్రాలను కేంద్ర బృందం పరిశీలించి పేటెంట్ హక్కు కల్పించింది. ప్రభుత్వం సహకరిస్తే అధిక ధరలతో పాటు మార్కెటింగ్ సౌకర్యం పెరుగుతుంది.

-కె.వీరభద్రుడు, చేనేత కార్మికుడు, నారాయణపురం

వినియోగించుకోవాలి..

చేనేత అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందులో భాగంగానే ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించింది. అర్హుల వివరాల నమోదు పూర్తయ్యింది. ఈ అవకాశాన్ని చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి. త్రిఫ్ట్ పథకాన్ని ప్రభుత్వం పునరుద్ధరించింది. సొసైటీలకు ఎన్నికలు పూర్తి చేసి.. లబ్ధిదారులను ఎంపికచేస్తాం. చేనేత శాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

-ఆర్వీ మురళీకృష్ణ, ఏడీ, చేనేత జౌళిశాఖ, విజయనగరం

ఫారెస్ట్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసేదెలా?

● ఓటీపీఆర్ ఐడీ కలిగిన అభ్యర్థులకు కష్టాలు ● పని చేయని టోల్ ఫ్రీ నెంబర్లు ● మెయిల్ పంపించినా కానరాని స్పందన

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ద్వారా 2019లో ఫారెస్ట్ సెక్షన్, బీటు ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదలైంది. అప్పట్లో అర్హులైన అందరితో పాటు గంట్యాడ గ్రామానికి చెందిన ఇ.రమేష్, ఎస్.శివ అనే యువకులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. వివిధ కారణాల వల్ల నోటిఫికేషన్ రద్దు కావడంతో పరీక్ష నిర్వహించలేదు. తిరిగి అవే పోస్టుల భర్తీకి గత నెలలో ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. సాధారణంగా ఏపీపీఎస్సీలో ఏ నోటిఫికేషన్ ఇచ్చినా.. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఒకసారి తమ వివ రాలు రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఒక ఓటీపీఆర్ ఐడీ వస్తుంది. దీని ప్రకారం ఎప్పుడు ఏ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పుడు ఏపీపీఎస్సీ విడుదల చేసిన నోటిఫికేషన్ మేరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు తిరిగి ఆ యువకులు దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్‌లో 'నో రికార్డ్సు ఫౌండ్' అంటూ స్ర్కీన్‌పై కనిపిస్తోంది. పోనీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలంటే ఆల్‌రెడీ రిజిస్టర్డ్ అంటూ కనిపిస్తోంది. దీంతో వారు సంబంధిత పోస్టులకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. దీనిపై వారు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉన్న టోల్ ఫ్రీ నెంబరుకు కనీసం 50 సార్లు ఫోన్ చేశారు. కానీ ఆ ఫోన్ పని చేయడం లే దు. అలాగే వెబ్‌సైట్‌లో ఉన్న మెయిల్‌కు మెసేజ్ చేసినా స్పందన లేదు. ఈ సమస్య ఈ ఇద్దరు యువకులదే కాదు. జిల్లా వ్యాప్తంగా చాలా మంది నిరుద్యోగులు ఇటువంటి సమస్యతో అవస్థలు పడుతున్నారు.

కష్టపడి చదివినా..

గత వైసీపీ హయంలో గ్రామ, వార్డు సచివాలయాలు తప్ప మిగిలిన ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయలేదు. చాలా మంది నిరు ద్యోగులు ప్రభుత్వ నోటిఫికేషన్ల కోసం నిరీక్షించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో వివిధ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల అవుతున్నాయి. అందులో భాగంగా ఏపీపీఎస్సీ ద్వారా ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్, బీటు ఆఫీసర్ కలిపి మొత్తం 691 పోస్టులకు గత నెలలో నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకుంటున్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఇబ్బంది లేదు. కానీ గతంలో ఓటీపీఆర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారే ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు. పగలూ రాత్రీ తేడాలేకుండా కష్టపడి చదివినా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేకపోవడంతో సంబంధించిన అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 10వ తేదీ వరకూ గడువు ఉంది. ఒకవైపు గడువు దగ్గర పడడం.. మరోవైపు దరఖాస్తుకు అవకాశం లేకపోతుండడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.



ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో నో రికార్డు ఫౌండ్ అంటూ కనిపిస్తున్న దృశ్యం



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఆర్మ్‌డ్ పోలీసులు


పంద్రాగస్టు కోసం మాక్‌డ్రిల్

పార్వతీపురం టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం జిల్లా యంత్రాంగం స్వాతంత్ర దినోత్సవం కోసం సన్నద్ధమవుతోంది. వేడుకలు పురస్కరించుకుని నిర్వహించే పరేడ్‌కు ముందస్తుగా పోలీసులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఈమేరకు బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. కాగా స్వాతంత్ర్య దినోత్సవాల్లో ఉత్తమ ప్రతిభ చూపి ప్రతిఒక్కరి చేత శభాష్ అనిపించు కోవాలని డీఎస్పీ సిబ్బందికి సూచించారు.

సంస్కృతం.. ప్రాచీన భాష

● ఇతర దేశాల్లోనూ ఈ పదాల మూలాలు

● నేటి నుంచి సంస్కృత భాషా వారోత్సవాలు



పలు భాషలకు సంస్కృతం మూలం అని తెలిపే చార్టు




ప్రాచీన కాలంలో రాగిరేకులపై నిక్షిప్తమైన సంస్కృత భాష

బొబ్బిలి ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రాచీనభాష సంస్కృతం. ప్రపంచంలోని అనేక భాషలకు మూలం. మూడింట రెండొంతుల భాషల్లో సంస్కృతభాష ప్రభావం ఉంటుందని పండితులు చెబుతున్నారు. ఉత్తరాది భాషల్లోనే కాకుండా దక్షిణాదికి చెందిన ద్రవిడ భాషలలో సైతం సంస్కృతం మూలాలు ఉన్నాయంటారు. గురువారం నుంచి ఏడు రోజుల పాటు సంస్కృత భాషా వారోత్సవాలను పురస్కంచుకుని ఇంకా వారు ఏం చెబుతున్నారంటే..

● సంస్కృతంలో వైదిక శైలి, కావ్యశైలి అని రెండు ఉన్నాయి. ఈ రెండింటికీ తేడా ఉంది. కాళిదాసు, భారవి, దండి వంటి సుప్రసిద్ధ కవుల కాలం నుంచి లౌకిక సంస్కృతం ప్రాచుర్యం పొందింది. ఇండో యూరోపియన్ దేశాలలో ఈ భాష బాగా విస్తరించింది. ప్రపంచాన్ని ఏలుతున్న ఆంగ్లభాషలో అనేక పదాలు సంస్కృతం నుంచి వచ్చినవేనని చెబుతారు. భ్రాత్రూ అనే పదం నుంచి బ్రదర్ అని, మూడు అంకె నుంచి త్రీ అనే పదాలు ఉదాహరణగా చెప్పవచ్చు.

● వేదాలలో ప్రస్తావించబడిన ఆగ్నేయాస్త్రం.. అగ్నిక్షిపణి, వరుణాస్త్రం.. మేఘమథనం వంటివి సంస్కృతభాషతో నిండినవే. పూర్వం రాజులు ఈ భాషను బాగా పోషించేవారు. ఇతర దేశస్థుల దండయాత్రలు, ఆక్రమణల కారణంగా ఇప్పుడు ఇది మృతభాషగా మారిపోయిందని భాషాభిమానులు చెబుతున్నారు.



● జర్మనీకి చెందిన మాక్స్‌ముల్లర్ అనే పండితుడు భారత్‌కు వచ్చి సంస్కృతభాషను అధ్యయనం చేశారు. ఆయన జర్మన్, ఇంగ్లీషు భాషల్లోనికి వేదాలను అనువదించారు. దీని ప్రభావంగా జర్మనీ శాస్త్ర విజ్ఞానరంగం ప్రఖ్యాతి గాంచింది. ఆరో శతాబ్దంలో కాళిదాసు సంస్కృతంలో రచించిన అభిజ్ఞానశాకుంతలం ప్రపంచ స్థాయిలో నేటికీ ఉత్తమ నాటకంగా ఖ్యాతిని గడించింది.

● బొబ్బిలిలో ప్రముఖ వేదపండితులు సామవేదుల రామగోపాలశాస్త్రి వేదపాఠశాలను 3 దశాబ్దాల పాటు నిర్వహించారు. అనేకమందికి సంస్కృతభాషను నేర్పించారు. నేడు ఆయన శిష్యులు అనేకమంది భాషా పండితులుగా ఉద్యోగాలు చేస్తున్నారు.

జర్మనీలో ప్రతీ యూనివర్సిటీలో సంస్కృత భాషాపీఠం ఉంటుంది..



భారత్‌కు చెందిన అమూల్యమైన సొత్తు సంస్కృతభాష జర్మనీలోనూ వేనూళ్లకుంది. అక్కడ ప్రతీ విశ్వవిద్యాలయంలో సంస్కృతభాషా పీఠం ఉంటుంది. మృతభాషగా మారిన సంస్కృతానికి ప్రభుత్వాలు జీవం పోయాలి. విద్యార్థులు మార్కుల స్కోరింగ్ కోసమైనా ఈ భాషను ఎన్నుకోవడం కొంతవరకు స్వాగతించదగ్గదే. ప్రభుత్వ పరంగా గట్టి కృషి జరగాల్సి ఉంది.

-చింతా అప్పారావు, రిటైర్డ్ లెక్చరర్, బొబ్బిలి



పాతబస్టాండ్ కూడలిలో భారీ వాహనాల రాకపోకల వల్ల ట్రాఫిక్ స్తంభించిన దృశ్యం

పార్వతీపురంలో ట్రాఫిక్ కష్టాలు

● పట్టణంలో నుంచి భారీ వాహనాల రాకపోకలు

● నియంత్రణపై కొరవడిన పర్యవేక్షణ

పార్వతీపురం టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణ ప్రజలు ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారు. జిల్లా కేంద్రంగా మారిన తర్వాత ఈ సమస్య మరింత ఎక్కువయ్యింది. గత రెండు దశా బ్దాల్లో పట్టణ జనాభాతోపాటు వాహనాల సంఖ్య పెరిగాయి. దీనికితో ఏజెన్సీకి ముఖ ద్వారంగా ఉండడం, ఒడిశాకు పట్టణం గుండానే రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రధానంగా పాతబస్టాండ్ కూడలితోపాటు ఆర్టీసీ కాంప్లెక్స్, సౌందర్య థియేటర్ కూడళ్ల వద్ద వాహనాల రద్దీగా ఎక్కువగా ఉండడంతో ఉదయం, సాయంత్రం ద్విచక్రవాహన చోదకులతో పాటు పాదచారులు, ఇబ్బందిపడుతున్నారు. ఈ కూడళ్ల మీదుగా పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులతోపాటు ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధానంగా భారీ వాహనాలకు పట్టణం మీదుగా రద్దీ సమ యంలో అనుమతి ఇవ్వడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని పలువురు చెబుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణపై పోలీసు యంత్రాంగం పర్యవేక్షణ కొరవడడంతో పట్టణంలో నిత్యం వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. కాగా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు పట్టణ సీఐ మురళీధర్ తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జామి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ సురేష్‌బాబు తెలిపారు. కుమారాం, ఎంకే వలస, బలరాంపురం, ఏఆర్‌పేట, కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

పాఠశాల భవనాల జప్తు

కొత్తవలస, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దేవాడ పంచాయతీలోనున్న అమరావతి పాఠశాల భవనాన్ని కార్మిక రాజ్య బీమా సంస్థ(ఈఎస్ఐ) అధికారులు బుధవారం జప్తు చేశారు. పాఠశాలను మూసివేసినట్టు ఈఎస్ఐ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి పాఠశాల యాజమాన్యం తమ ఉద్యోగులకు సంబంధించిన ఈఎస్ఐ బకాయిలు చెల్లించకపోవడంతో పాఠశాల భవనాన్ని జప్తు చేసినట్టుగా రికవరీ అధికారి జి. వేణుమాధవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మరో అధికారి అభిజిత్ కుమార్ పాల్గొన్నట్టు తెలిపారు.

మెనూ పాటించండి

వేపాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పెట్టాలని జిల్లా వెలమ సంఘం అధ్యక్షుడు బోజంకి రామునాయుడు అన్నారు. చినగుడిపాల ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు.

నిర్బంధం తగదు

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యాశక్తి కార్యక్రమాన్ని తొలుత ఐచ్ఛికమని చెప్పి ప్రస్తుతం నిర్బంధం చేస్తోందని.. దీనిని విరమించుకోవాలని ప్యాపిటో చైర్మన్ పి.శ్రీనివాస్ తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తామన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ 2.80 కోట్లు

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నియోజవర్గంలో రెండు రోడ్ల అభివృద్ధికి రూ.2.80 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ముగింనాపల్లి ఆర్ అండ్‌బీ బ్రిడ్జి వయా యాతపేట నుంచి చేల్లంగిపేట వరకూ 6.7 కిలోమీటర్లు, మొయిద నారాయణపురం రోడ్డు 4.5 కిలోమీటర్ల మేరకు అభివృద్ధి చేయనున్నారు.

నేడు చేనేత దినోత్సవం

జాతీయ చేనేత దినోత్సవాన్ని రాజాంలో గురువారం నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఆర్‌వీ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

గంట్యాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గంట్యాడ బీసీ బాలుర వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులకు బోధించడానికి నాలుగు ట్యూటర్ పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సంక్షేమాధికారి శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. గణితం, సైన్సు, హిందీ, ఇంగ్లీషు సబ్జెక్టుల బోధనకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కందిపప్పు కుంభకోణం

చీపురుపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి కేంద్రంగా కోట్లాది రూపాయల విలువైన కందిపప్పు స్కామ్ జరిగిందని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ గద్దే బాబూరావు ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలకు సరఫరా చేయడానికి ఇటీవల రూ.75 కోట్లకు టెండరు ఖరారు చేశారన్నారు. శ్రీకాకుళం జిల్లాలో పనికి రానిదిగా తేల్చిన కంది పప్పును ఈ టెండరు పొందిన వ్యక్తి రాయలసీమలోని ప్రభుత్వ విద్యా సంస్థలకు సరఫరా చేశారని ఆరోపించారు. ప్రభుత్వం దీనిపై విచారణ చేపట్టాలని కోరారు.

సమావేశం ఎలా నిర్వహిస్తారు?

జామి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): లొట్లపల్లి పశువుల సంతకు ప్రభుత్వం రెండేళ్లుగా లైసెన్స్ ఇవ్వలేదని.. అయినా అనధికారికంగా నడుస్తోందని రాష్ట్ర జంతు సంరక్షణ కమిటీ ప్రతినిధి లోగిశ రామకృష్ణ అన్నారు. అలాంటి సమయంలో ఈవోపీఆర్‌డీ ఉమ మానిటరింగ్ కమిటీ సమావేశం ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. బుధవారం సచివాలయంలో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దిగువ స్థాయి ఉద్యోగులు హాజరయ్యారు. సభ్యులు మాట్లాడుతూ అక్రమాలను అడ్డుకునేందుకు కలెక్టర్ చొరవ చూపాలని కోరారు.

పాఠశాలకు రహదారి

భోగాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భోగాపురం ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు పల్లంట్ల జగదీష్ సొంత నిధులతో బుధవారం రహదారి నిర్మించారు. దీనికి రూ.30 వేలు వెచ్చించారు.

కాలువ ఆక్రమించి.. ఆపై దుకాణం పెట్టి!

రాజాం రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువ ఆక్రమణకు గురైంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం.. పదుల సంఖ్యలో షాపింగ్‌మాల్స్ వ్యాపార సముదాయాలు. పక్కనే త్రీస్టార్ హోటల్. ఇదే అదనుగా ఆ కాలువపై రాత్రికి రాత్రే ఐరన్ బడ్డీ పెట్టేశాడో వ్యక్తి. పేరుకి బడ్డీ స్థలమే అనుకుంటే పప్పులో కాలేసినట్లే. బహిరంగ మార్కెట్ ధర ప్రకారం హీనపక్షంగా స్థలం విలువ రూ.25 లక్షల పైమాటే. రాజాం-డోలపేట మార్గంలో మంగళవారం రాత్రి జరిగిన ఆక్రమణకు సంబంధించి వివరాల్లోకి వెళితే.... రాజాం-డోలపేట మార్గంలో కాలువల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఈ మార్గంలో త్రీస్టార్ హోటల్‌కు దక్షిణాన సాగునీటి కాలువను మంగళవారం పరిశుభ్రం చేయించి మురుగునీరు సజావుగా ప్రవహించే విధంగా పక్కాగా కాలువ నిర్మాణం చేపట్టారు. అప్పటికే పక్కా ప్లాన్‌తో ఉన్న ఓ వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి దాటాక షట్టర్‌తో కూడిన ఐరన్‌బడ్డీని పెట్టేశాడు. కాలువపై కనీసం పలకలు కూడా వేయకుండానే బడ్డీ పెట్టడంపై మున్సిపల్ అధికారులు కంగుతిన్నారు. ఇదిలాఉంటే దీని వెనుక మున్సిపల్ సిబ్బంది హస్తం ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. త్రీస్టార్ హోటల్ పక్కన బడ్డీ ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా విస్తరణ పనులకు ఉపయోగించే ప్రభుత్వ మెటీరియల్‌తో కాలువ నిర్మాణం చేపట్టారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే విషయాన్ని రాజాం మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడు వద్ద ప్రస్తావించగా ఆక్రమణ విషయం తన దృష్టికి వచ్చిందని... నోటీసులిచ్చి తొలగించే ఏర్పాటు చేయిస్తానని స్పష్టం చేశారు.



కాలువ మీద ఏర్పాటు చేసిన దుకాణం

అనధికారిక పైపులను మూసివేయండి: ఎమ్మెల్యే కళా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

రాజాం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రధాన కాలువలపై ఉన్న అనధికారిక పైపులను మూసివేసి అధికారికమైన పైపుల ద్వారానే సాగునీరు అందించాలని టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాజాంలోని తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీపురుపల్లి నియోజకవర్గంలో సక్రమంగా సాగునీరు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని.. అనధికారిక పైపులను మూసివేయించి... పూర్తి స్థాయిలో సాగునీరు అందించాలని ఆదేశించారు. దీని కోసం రెవెన్యూ, పోలీసు అధికారుల సాయం తీసుకోవాలని సూచించారు. లస్కర్లు లేకపోవడం వల్ల రైతులు ఇష్టాను సారంగా ప్రధాన కాలువలో అడ్డంగా పూన్లు వేసి నీటిని తిప్పుతున్నారని అన్నారు. ఈ విషయంలో జాప్యం చేయకుండా అందరికీ సాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఈఈ పి.అప్పలనాయుడు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు హరికృష్ణ, లావణ్య, సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డలకు ఆరోగ్యం: ఎమ్మెల్యే



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే లలిత కుమారి

శృంగవరపుకోట ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే లలిత కుమారి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి పాలు ఇవ్వాలని గర్భిణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ సంతోషి కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, రాష్ట్ర పార్టీ కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు.

మినీ కిట్లు పంపిణీ

లక్కవరపుకోట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు మెట్ట పంటలు పండించేందుకు అనువుగా అపరాలకు సంబంధించిన మినీ కిట్స్‌ను స్థానిక ఎమ్మెల్యే లలితకుమారి బుధవారం రైతులకు అందజేశారు. ఎల్.కోట రైతు సేవా కేంద్రంలో ఏవో హరికృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ బి.భానులత, ఏఈవో ముత్యాలనాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లిలో...

బొండపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతోనే బిడ్డకు మేలని బొడసింగిపేట మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కోరాడ కృష్ణ అన్నారు. బుధవారం గొట్లాం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను సీడీపీవో ఉమాభారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు శిడగం శ్రీనివాస్, అంగన్‌వాడీలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మెరకముడిదాంలో...

మెరకముడిదాం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బిడ్డకు పాలివ్వడం తల్లికి లాభమేనని, రొమ్ము క్యాన్సర్ వంటివి రాకుండా బయట పడవచ్చునని స్త్రీ సంక్షేమశాఖ పర్యవేక్షకులు శ్రీదేవి అన్నారు. బుధవారం మెరకముడిదాం సచివాలయ ప్రాంగణంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు అమృతం వంటివని అన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి, పురవీధుల్లో తల్లిపాల ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కే సాధన, అంగన్‌వాడీ కార్యకర్తలు గౌరి, గాయత్రి, అప్పలరాము, వరలక్ష్మి, ఏఎన్ఎం కోటేశ్వరమ్మ, ఆశా కార్యకర్తలు సూర్య, లలిత, కుమారి తదితరులు పాల్గొన్నారు.

బిడ్డలకు తల్లిపాలు అందించాలి

రాజాం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బిడ్డలకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న సూచించారు. బుధవారం లచ్చయ్యపేట గ్రామంలో ని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు అందిస్తే... బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయకుమారి, ఎం.శ్రీదేవి, రమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు బయోమెట్రిక్ కార్డులు తప్పనిసరి

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తీరంలో ఉన్న మత్స్యకారులు తప్పనిసరిగా వారికి మంజూరుచేసిన బయోమెట్రిక్ గుర్తింపు కార్డులు ధరించాలని, లేని పక్షంలో మెరైన్ పోలీసులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. తీర ప్రాంత భద్రతపై బుధవారం కలెక్టరు చాంబర్‌లో భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీర ప్రాంత భద్రతా కమిటీ వివిధ ప్రతిపాదనలు చేసింది. జిల్లాలోని 29 కిలోమీటర్ల తీరప్రాంతంలో రహదారి ఏర్పాటు, గస్తీ కోసం తీరానికి ఒకటి చొప్పున వాచ్ టవర్ రెండు వాహనాలు, 16 సీసీ కెమెరాల ఏర్పాటుకు కమిటీ ప్రతిపాదించింది. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ బీచ్ కారిడార్ పనుల్లో భాగంగా మన తీరం వెంబడి 29 కిలోమీటర్లు రహదారి కోసం ప్రతిపాదిస్తామని చెప్పారు. గస్తీ కోసం రెండు వాహనాలు, ఒక్కో తీర తీర ప్రాంతానికి ఒక్కో వాచ్ టవర్‌కు నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో తీర భద్రత విభాగం అడిషనల్ సూపరెంటెండెంట్ ఎం.శ్రీనివాసరావు, డీఎస్పీ స్వప్నిల్ చౌహాన్, సీనియర్ ఇంటెలిజెంట్ ఆధికారి వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

ప్రజలతో మమేకం కావాలి:ఎస్పీ

విజయనగరం క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలతో మమేకం అవ్వాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో అధికారులు, కానిస్టేబుళ్లు పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలను భాగస్వామ్యులను చేయడమే లక్ష్యంగా పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచుతామన్నారు. గ్రామాల్లో చిన్నచిన్న వివాదాలు శాంతిభద్రతల సమస్యగా మారే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటి వరకు 300 గ్రామాల్లో పోలీసు అధికారులు పల్లెనిద్ర చేపట్టినట్టు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ

కులాల పేరుతో చిచ్చుపెడితే ఊరుకోం



మాట్లాడుతున్న ఎంపీపీ సోమేశ్వరరావు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): శాంతియుతంగా ఉన్న గ్రామాల్లో కులాల పేరుతో కొందరు చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని..ఇది తగదని ఎంపీపీ సోమేశ్వరావు కోరారు. బుధవారం బొడ్డవర సచివాలయంలో పంచాయతీ వార్డు సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మట్లాడుతూ గిరిజనులమనే ఉద్దేశంతో తమను ఇబ్బంది పెడుతున్నారని సర్పంచ్ మీనాకుమారి అనడం సరికాదన్నారు. కొంతమంది రెచ్చగొట్టడంతో పంచాయతీ కార్యాలయంలో నిరసన చేయడం తగదన్నారు. ఇదిలా ఉండగా.. పంచాయతీ కార్యాలయంలో సమావేశం జరుగుతుండగా పోలీసులు రావడం కలకలం రేపింది. సమావేశం ప్రశాంతంగా ముగియడంతో వెళ్లిపోయారు. ఈ సమావేశంలో వార్డు సభ్యుడు శ్రీనువాసరాజు, మురళీరాజు, ఆదారి అప్పారావు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్ల జాబితాను సమర్పించండి

నెల్లిమర్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు నియోజకవర్గంలోని 248 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి తమ పోలింగ్ ఏజెంట్ల పేర్లు జాబితాలను సత్వరమే తమ కార్యాలయానికి అందజేయాలని సహాయ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ కె.శ్రీకాంత్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిదులు గేదెల రాజారావు, పతివాడ రాజేష్, ఎం.పాపారావు, కిల్లంపల్లి రామారావు, కనకల పద్మనాభం, ఎరుకొండ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్‌ను రానివ్వం



నినాదాలు చేస్తున్న నాయకులు

వేపాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గిరిశిఖర గ్రామం మారిక గ్రామంలో అదాని తలపెట్టిన హైడ్రోపవర్ ప్లాంట్ నిర్మాణానికి ముందుకు వస్తే తరిమి కొడతామని వ్యవసాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్‌లు అనానరు. బుధవారం మారిక గ్రామంలో సంప్రదాయ విల్లంబులు చేతపట్టి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరాపల్లిలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ చేసిన ప్రకటనకు జీఓ తెచ్చి మాట నిలుపుకోవాలని డిమాండ్ చేసారు. మారికలో ఎగువ ప్రాజెక్ట్ నిర్మించి గిరిజన రైతుల బతుకులు బుగ్గిపాలు చేయాలని చూస్తున్నారని అన్నారు. విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నిస్తే గిరిజనులంతా ఐక్యమై తరిమి కొడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వీర్రాజు, ఆనంద్, సోమేష్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఆటల పోటీలు

శృంగవరపుకోట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట కోర్టు న్యాయవాదులు, ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు న్యాయాధికారి బి.కనకలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు తెలిపారు. చెస్, క్విజ్, మ్యూజికల్ చైర్, పాటల పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి బీఎస్‌రామారావు, న్యాయవాదులు బి.త్రిమూర్తులు, డబ్ల్యూఎన్ శర్మ, వారాది ఈశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు...

దత్తిరాజేరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): షికారు గంజి ఆదర్శ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ చింతల రాజేష్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థుల ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. ఖోఖో, కబడ్డీ, పరుగుపందెం పోటీలను హెచ్ఎం మాడెం ఈశ్వరరావు ప్రారంభించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఆన్‌లైన్ విధానం తప్పనిసరి

గజపతినగరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన లావాదేవీలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వెలుగు ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ రత్నాకర్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సమావేశంలోనే అన్ని లావాదేవీలు చేయాలన్నారు.

క్రైం న్యూస్

చికిత్స పొందుతూ యువకుడి మృతి

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. సంతకవిటి మండలం జీఎన్‌పురానికి చెందిన గురుగుబిల్లి పృథ్వీరాజ్ (25) గత కొంతకాలంగా నగరంలోని ఓ బంగారు దుకాణంలో పని చేస్తూ డైమండ్ పార్క్ వద్ద తన సహచరులతో కలిసి ఉంటున్నాడు. ఈనెల 4న కడుపునొప్పితో బాధపడుతూ మనస్తాపంతో పాయిజన్ తాగి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే సహచరులు గమనించి చికిత్స నిమిత్తం 108లో రిమ్స్‌కు తరలించారు. అనంతరం అతని మేనమామకు సమాచారం ఇచ్చారు. అతను వచ్చి మెరుగైన చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

108 సిబ్బంది చొరవతో వ్యక్తికి చికిత్స

కొత్తవలస, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస జడ్పీహైస్కూల్ గ్రౌండ్ సమీపంలో అనుమానాస్పదంగా పడి ఉన్న వ్యక్తిని 108 సిబ్బంది చికిత్స చేయించి బతికించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. రోడ్డు పక్కన ఒక వ్యక్తి పడిపోయి ఉన్నట్టు 108 సిబ్బందికి స్థానికులు సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి పరిశీలించేటప్పటికే షుగర్ స్థాయిలు పడిపోయి.. కోమాలోకి వెళ్లే పరిస్థితి నెలకొంది. దీంతో ఆ వ్యక్తిని 108 వాహనంలో హుటాహుటిన విశాఖపట్టణం కేజీహెచ్‌కు తరలించి అక్కడ చికిత్స చేయించారు. చికిత్స చేసిన కొద్దిగంటలలోనే తేరుకున్న ఆ వ్యక్తి తనపేరు ఉప్పలపాటి వెంకటరావు(54) అని, కొత్తవలస గ్రామమని చెప్పాడు. తాను కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నానని, తనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. వారు తనను పట్టించుకోవడం మానేశారని చెప్పాడు. దీంతో 108 సిబ్బంది వెంకటరావు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి



ఇంటింటి ప్రచారం చేస్తున్న రవిశేఖర్

నెల్లిమర్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. బుధవారం గొర్లిపేటలో నిర్వహించిన సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు తాడ్డి సత్యనారాయణ, నారాయణ రావు, జగన్నాథం పాల్గొన్నారు.

రైల్వే వంతెనకు స్థల పరిశీలన



మ్యాపును పరిశీలిస్తున్న అధికారులు

గజపతినగరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెంటాడ రైల్వే గేటు వద్ద వంతెన నిర్మాణానికి సంబంధించి రైల్వే, ఆర్ అండ్ బీ అధికారులు బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం మూడో రైల్వే లైను నిర్మాణం వైపు అడుగులు పడుతున్నాయి. దీంతో వంతెన కోసం రూ.46.86 కోట్లు మంజూరైనట్టు అధికారులు తెలిపారు. ఈ మేరకు రైల్వే ఇంజనీరింగ్ అధికారులు డి.ప్రకాశరావు, ఎస్.రావు, ఆర్ అండ్‌బీ డీఈ ఎ.రవిశేఖర్, ఏఈ అజయ్‌భార్గవ్‌లు సంయుక్తంగా స్థలాన్ని పరిశీలించారు. ఈ వంతెన ఏర్పాటైతే రాకపోకలకు ఇబ్బందులు తప్పుతాయని ఈ ప్రాంతీయులు అంటున్నారు.

ఫాం పాండ్స్‌కు ప్రాధాన్యం ఇవ్వండి



మాట్లాడుతున్న డ్వామా పీడీ శారదాదేవి

మెరకముడిదాం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే ఫాం పాండ్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శారదాదేవి ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సాంకేతిక, క్షేత్ర సహాయకులకు నిర్వహిస్తున్న ఎస్ఎంఎంఎస్ 2.0పై శిక్షణ, సమీక్ష కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ హార్టికల్చర్, ఎవెన్యూ ప్లాంటేషన్, చెరువు గట్లపై మొక్కలు, ప్రభుత్వ సంస్థలలో మొక్కలు పెంచడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు చేపల పెంపకంతో పాటు కూరగాయల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీవో కామేశ్వరరావు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.


జిందాల్ సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, వారు శాంతియుతంగా చేస్తున్న పోరాటానికి అనుమతులు ఇచ్చేలా చూడాలని అధికారులు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు డిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ కిశోర్ మాకానాను కోరారు. ఈ విషయమై రఘురాజు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జిందాల్ చేసిన మోసాలు, నిర్వాసితుల కుటుంబాల ఉద్యోగాలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు తదితర అంశాలను వివరించామని తెలిపారు. వీటిపై స్పందించిన చైర్మన్ దీనిపై 15రోజుల్లో నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశిస్తామని తెలిపారు. నిర్వాసితులకు న్యాయంగా రావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారన్నారు.

15 నుంచి ప్లాస్టిక్ రహితంగా కార్యాలయాలు



మాట్లాడుతున్న కమిషనర్

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15నుంచి నగరంలోని అన్ని సచివాలయాలు, నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దనున్నట్టు కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. బుధవారం ఈ విషయంపై కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి ప్రభుత్వం సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయనుందన్నారు. ఇందులో భాగంగా 15నుంచి ప్లాస్టిక్ రహిత కార్యాలయంగా తీర్చిదిద్దేందుకు సమాయత్తం అవుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్యాధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి పాల్గొన్నారు.

ఇరుకు రోడ్లు.. అడ్డదిడ్డంగా పార్కింగ్



మక్కువ ప్రధాన రహదారిలో నిలిచిపోయిన వాహనాలు

●మక్కువలో జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య ●చోద్యం చూస్తున్న పోలీసు యంత్రాంగం

సాలూరురూరల్ (మక్కువ),ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మక్కువ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. ప్రధానంగా దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన ఇరుకు రోడ్లు కావడం, గత పదేళ్లలో జనాభా, వాహనాల సంఖ్య పెరగడంతో అగచాట్లు తప్పడంలేదు.ఆటోలు, ఇతర వాహనాల చోద కులు అడ్డగిడ్డంగా పార్కింగ్ చేస్తుండడంతో కొన్నిసార్లు ప్రమాదాలుచోటుచేసుకుంటున్నాయి. మన్యం జిల్లాకు కీలక మండలం, ముఖద్వారం కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీనికితోడు గిరిజనులు సేకరించిన ఉత్పత్తులు సాలూరు తదితర ప్రాంతాలకు తరలించేందుకు ఇక్కడకే వస్తుంటారు. సింగల్ లైన్ రోడ్లు కావడంతో అవతలి వైపు వెళ్లేందుకు ఒక్కోసారి ద్విచక్రవాహన చోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఉద్యోగులు కార్యాలయాలు,విద్యార్థులు విద్యాసంస్థలకు, ఇంటికి వెళ్లే సమయంలో అరగంటపాటు ట్రాఫిక్ నిలిచిపోతోంది.దుగ్గేరు, చెముడు, మక్కువ గ్రామంలోకి వెళ్లే జంక్షన్లో నిత్యం జనసంచారంతో కిటకిటలాడుతోంది. ఇరుగ్గా ఉండే రోడ్లపైనే కూరగాయల విక్రయదారులువ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మక్కువలో బస్సు షెల్టర్ లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లేందుకు రోడ్లపైనే వచి ఉండడంతో కూడా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మన్యం వాసులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



చిలకాంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసిన దృశ్యం

గరుగుబిల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ట్రాన్స్ ఫార్మర్లను ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నెల రెండో తేదీన ఆంధ్రజ్యోతిలో మరమ్మతులు చేయరు.. కొత్తవి వేయరు శీర్షి కతో ప్రచురితమైన కథనంపై ట్రాన్స్‌కో అధికారులు స్పందించా రు. ఈ మేరకు బుధవారం చిలకాం పరిధిలో కొత్తగా ట్రాన్స్‌ఫార్మ ర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో మండల ఏఈఈ బడే శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి, కొత్తగా ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నా మన్నారు. రైతులకు అసౌకర్యం కలగకుండా అవసర మైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు 63 కేవీ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు



సెంట్రల్ లైటింగ్‌కు సంబంధించిన మరమ్మతులు చేస్తున్న అధికారులు

సీతంపేట రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. మంగళవారం సీతంపేటలోని సెంట్రల్ లైటింగ్ వెలగకపోవడంపై ఆంధ్ర జ్యోతిలో అక్కడ అలా..ఇక్కడ ఇలా శీర్షికతో కథనం ప్రచురితమయ్యింది. దీంతో ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి,మండల ప్రత్యేకాధికారి జి.చిన్నబాబుల ఆదేశాల మేరకు బుధవారం పంచాయతీ, ట్రాన్స్‌కో సిబ్బంది లైట్లకు మరమ్మతులు చేయించారు. ఈ పనులను ట్రాన్స్‌కో ఏఈ నీలిమ,పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ పరిశీలించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

పాలకొండ(వీరఘట్టం), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):అగ్నిప్రమాదాల నివారణపై అవగాహనతో ఉండాలని పాలకొండ అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు తెలిపారు.బుధవారంమండలంలోని కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, అగ్ని ప్రమాదం జరిగే సమయంలో ఎలా ప్రమాదం నుంచి తప్పించుకోవాలో వివరించారు.కార్యక్రమంలో పాలకొండ అగ్ని మాపక శాఖాధికారి సర్వేశ్వరరావు, సిబ్బంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలనూ ఆదరిస్తున్న చంద్రబాబు

గరుగుబిల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం అన్ని వర్గాలను ఆదరిస్తోందని మండల పరిషత్ అధ్యక్షులు ఉరిటి రామారావు తెలిపారు. బుధవారం మండలంలోని మరుపెంట గ్రామానికి చెందినపలువురికి నూతనంగా మంజూరుచేసిన వితంతుపింఛన్లను రామారావుతో పాటు కూటమి నాయకులు గులిపల్లి రామారావు, నగిరెడ్డి పోలినాయుడు, గులిపల్లి వెంకటనాయుడు, అక్కేనినారాయణరావు పంపిణీ చేశారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కురుపాం(జియ్యమ్మవలస),ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):యువత చెడు అలవాట్లు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని చినమేరంగి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పి.అనీష్ తెలిపారు.బుధవారం చినమేరంగి దళితవాడలో యువతతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా చెడు వ్యసనాల వల్ల కలిగే అనర్థాలు,ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగవకాశాలను వివరించారు కార్యక్రమంలో ఏఎస్ఐ పత్తిక కాసులు, కానిస్టేబుల్ రాజేష్ పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న కలపపై నివేదిక ఇవ్వాలి

కొమరాడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):స్వాధీనం చేసుకున్న కలపపై నివేదిక ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి కోరారు. కొమరాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రెండు నాటు బండ్లపై ఉన్న టేకు చెట్లపై దర్యాప్తు విషయంలో ఎంతటివారైనా విడిచిపెట్టవద్దని తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్ వద్ద రెండు నాటుబండ్లపై ఉన్న టేకు కలపను సీపీఎం నాయకులు పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడతూ చోళపదం సమీపంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న సుమారు 78 ఎకరాల అగ్రిగోల్డ్ భూముల్లో గల టేకు తోటలో చెట్లు రాత్రివేళ మాయమైనట్టు తెలిసిందన్నారు. ఏడు రోజులు గడిచినా అగ్రిగోల్డ్‌కు సంబంధించిన చెట్లా, లేకపోతే రైతుల పొలంలోనే చెట్లు అని తేల్చలేదని పేర్కొన్నారు.

జాబ్‌మేళాలు వినియోగించుకోవాలి

పాలకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి):యువత జాబ్‌మేళాలను వినియోగించుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణచైతన్య తెలిపారు. బుధవారం పాలకొండలోరాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 12 కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన మేళాలో 128 మంది నిరుద్యోగులు హాజరుకాగా 34మంది ఎంపికైనట్లు తెలిపారు.కార్యక్రమంలోతిరుపతిరావు పాల్గొన్నారు.

మక్కువలో భారీ వర్షం

సాలూరు రూరల్(మక్కువ), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మక్కువ తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం గంటపాటు భారీ వర్షం కురిసింది. ఉదయం ఉక్కపోత, ఎండతో అవస్థలుపడిన ప్రజలకు వర్షంతో ఉపశమనం లభించింది. ఇప్పటికే ఖరీఫ్‌లో పలుచోట్ల నాట్లు వేశారు.ఈ తరుణంలో కురిసిన వర్షంతో మేలు కలుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.మక్కువ ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో వాహనచోదకులు, పాదచారులు అవస్థలకు గురయ్యారు.

బీజామృతంతో వరి పంటకు మేలు

పాలకొండ(వీరఘట్టం), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీజామృతంతో వరి పంటలకు మేలని ఏవో సౌజన్య తెలిపారు. బుధవారం మండలంలోని కుంబిడి ఇచ్చాపురం గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజామృతంతో వరి నాట్లు వేసే ముందు చేసే సీడ్లింగ్ రూట్ డిప్ పద్ధతిని వివరించారు. నారు మడులు, ఎదచల్లిన పొలాలు, కంది పంటను పరిశీలించారు. గట్ల మీద కందులను ః వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సౌజన్య, సింధుజ పాల్గొన్నారు.

60 ప్యాకెట్లు..133 కిలోలు

(5వ పేజీ తరువాయి)

మండలం కొత్తలంగికి చెందిన కొర్ర డానియల్, పడాలపుట్టి వాసి జన్ని దివాకర్‌ను అరెస్ట్ చేశారు. మరో ఇరువురు నిందితులు కుమారుగుండికి చెందిన రాంబాబు, పరిసీలకు చెందిన కిరణ్‌లు మరో మార్గంలో శృంగవరపుకోటకు వెళ్లిపోయారని ఆమె తెలిపారు. పరారైన వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. సాలూరు రూరల్ సర్కిల్ పరిధిలో గడిచిన ఏడు నెలల్లో 1958 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సాలూరు పట్టణ సీఐ బి.అప్పలనాయుడు, సాలూరు రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు విస్తరించాలి: కలెక్టర్

పార్వతీపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు గిరిజన ప్రాంతాల్లో విస్తరించాలని రెడ్‌క్రాస్ జిల్లాఅధ్యక్షుడు, కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా రెడ్‌క్రాస్ నూతన అధ్యక్ష, కార్యదర్శి ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా ఎన్నికైన రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు చిత్తశుద్ధితో సేవలను పూర్తిస్థాయిలో ప్రజలకు అందించాలని తెలిపారు. ప్రతినెలా సంస్థ ద్వారా సేవలకు ప్రగతి నివేదికలు సిద్ధంచేయాలన్నారు. విద్యార్థులకు రెడ్ క్రాస్ తరఫున సాయం అందించాలని,అన్నదాన కార్యక్రమాలు వివరాలు నమోదు చేయాలన్నారు. రక్తహీనత నివారణ కోసం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధులకు వయోజన విద్య ద్వారా రాత్రి బడులు నిర్వహించాలన్నారు. గర్భిణులు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవం చేసుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్‌గా మంచిపల్లి శ్రీరాములు, కార్యదర్శిగా బి.నాగభూషణరావు, కోశాధికారిగా పెంటపాటి సూర్యారావును సభ్యులు ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.

నిర్ణయ యాప్‌తో తనిఖీలు: ఎస్ఆర్‌పీ



మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ పున్నపునాయుడు

గరుగుబిల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మాణం చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణయ యాప్‌తో తనిఖీలు నిర్వహించనున్నట్లు సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ ఈదుబిల్లి పున్నపునాయుడు తెలిపారు. బుధవారం మండలంలోని గిజబ, తోటపల్లి పంచాయతీల్లో 19వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో తప్పిదాలు జరిగితే సామాజిక తనిఖీల సిబ్బందికి తెలియజేయాలని కోరారు. క్షేత్ర సహాయకులకు భయపడి నిజాలను దాచకుండా రాత పూర్వకంగా అందించాలని తెలిపారు. కొన్ని పంచాయతీల్లో వేతనదారులను ఉపాధి సిబ్బంది హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. మండలానికి సంబంధించి 2024-25 సంవత్సరానికి గాను వేతనాలు, మెటీరియల్ పనులకు సుమారు రూ. 20 కోట్లు వ్యయం జరిగిందని చెప్పారు. గతంలో మాదిరిగా తనిఖీల్లో తప్పిదాలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించినట్లు తెలిపారు. పంచాయతీల పరిధిలో పనులు, మస్తర్లు తనిఖీలు అనంతరం గ్రామసభలు జరుగుతాయని చెప్పారు. తర్వాత రావివలస, రాయిందొరవలస, పెద్దూరు పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామసభలో సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి, శంకరరావు, ఎంపీటీసీ సభ్యులు ఎం.సింహాచలంనాయుడు, ఏపీవో ఎం.గౌరీనాథ్, క్షేత్ర సహాయకులు ఎం.పకీరునాయుడు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని గరుడ వాహనం సిద్ధం



తుది మెరుగులు దిద్దిన గరుడ వాహనం

గరుగుబిల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం పరిధిలో శ్రీవారి గరుడ వాహనం సిద్ధమైంది. గతంలో గరుడ వాహనం నిరుపయోగంగా మూలనపడి ఉండేది. ఊరేగింపు సమయంలో గరుడ వాహనాన్ని ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో రంగు మారిన గరుడ వాహనానికి అవసరమైన మెరుగులు దిద్దారు. ధ్వజ స్తంభానికి సంబంధించి అవసరమైన మెరుగులు చేపట్టారు. గురువారం ఉభయ దేవస్థానాల్లో వాణ ప్రస్థాశ్రమం, అన్న ప్రసాద సత్రం, గోవిందం గోశాలలను మంత్రులు, దేవదాయశాఖ అధికారులు, జిల్లా అధికారులు ప్రారంభించనున్న దృష్ట్యా దేవస్థానానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. దేవదాయశాఖ , ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించనున్న ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

మక్కువలో మజ్జి గౌరమ్మతల్లి వారాల పండుగ

సాలూరు రూరల్(మక్కువ), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మక్కువ కుమ్మరివీధివాసులు మజ్జి గౌరమ్మ తల్లి వారాల పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన రహదారి మీదుగా ప్రభను డప్పువాయిద్యాలు, యువత కేరింతల మధ్య ఊరేగించారు. మజ్జిగౌరమ్మ ఆలయానికి చేరుకున్న అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటాశ్రావణమాసంలో మజ్జిగౌరమ్మతల్లి వారాల పండుగ జరుపుకో వడం ఆనవాయితీగా వస్తోందని కుమ్మరివీధి వాసులు తెలిపారు. కార్యక్రమంలో శాలివాహనసంఘం జిల్లాఅధ్యక్షుడు కొత్తూరు, శంకరరావు పాల్గొన్నారు.



ప్రభను ఊరేగిస్తున్న భక్తులు

నేడు చేనేత దినోత్సవం

పార్వతీపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బలిజిపేట మండలంలోని నారాయణపురంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా చేనేతజౌళిశాఖాధికారి టి.జనార్దనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో కలెక్టర్, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు తల్లిపాలు వారోత్సవాల ముగింపు కార్యక్రమం

పార్వతీపురం,ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సాలూరులో కమ్యూనిటీ హాల్‌లోప్రపంచ తల్లి పాల వారోత్సవాలు ముగింపుకార్యక్రమాన్ని గురువారంనిర్వహించనున్నట్టు జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖాధికారి టి.కనకదుర్గ ఒక ప్రకటనలో తెలిపారు. కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా మహిళా శిశు సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖామంత్రి సంధ్యారాణి హాజరుకానున్నా రని పేర్కొన్నారు.

స్టీల్ గేట్లు బహూకరణ

పాలకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కోట దుర్గమ్మ అమ్మవారి ఆలయానికి స్టీల్ గేట్లను సుడా చైర్మన్ కొరికాన రవి బహూకరించారు. సుమారు రూ.రెండు లక్షలు వెచ్చించి గర్భాలయంలో ఏర్పాటు చేయించారు.

రైతు కూలీ మృతి

భామిని, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దదిమిలికి చెందిన రైతు కూలీ బలగ నారాయణరావు(40) బుధవారం సాయంత్రం పొలం నుంచి ఇంటికి వస్తుండగా పాముకాటు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు ఆటోలో కొత్తూరు సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు గుర్తించారు. కాగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని గురువారం పోస్టుమార్టానికి తరలిస్తామని బత్తిలి ఎస్ఐ జి.అప్పారావు తెలిపారు. నారాయణరావుకు భార్య స్వప్న, ఇద్దరు కుమార్తెలుఉన్నారు.నారాయణ మృతితో ఆ గ్రామంలో విషాదం అలముకుంది.

జనసేన నాయకుడు మృతికి సంతాపం

పాలకొండ(వీరఘట్టం),ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వండువకు చెందిన జనసేన నాయకుడ శౌంర్యాన‌శ్రీనివాసరావు మృతి చెందడంతో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సంతాపం తెలిపారు. శ్రీనివాసరావు ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పీవో ఆధ్వర్యంలో నియామకాలు జరగాలి

పార్వతీపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి):పార్వతీపురం, సీతంపేట, పాడేరు ఐటీడీఏ పరిధిలోని ఏకలవ్య పాఠశాలల్లో ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు ఆయా ఐటీడీఏల పీవోల ఆధ్వర్యంలో నియామకాలు చేపట్టాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నియామక అధికారం ప్రిన్సిపాళ్లకు ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు.ఈపోస్టులు ఆయా జిల్లాలోని అర్హులైన గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని డిమాండ్‌చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాదిగా పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలకు రెగ్యులర్ పీవోలను నియమించలేదని, ప్రస్తుతం ఎఫ్ఏసీ పీవోలుగా విధులు నిర్వహిస్తున్న అశుతోష్ శ్రీవాస్తవ, యశ్వంత్‌కుమార్‌రెడ్డిలను రెగ్యులర్ ఐటీడీఏ పీవోలుగా నియమించి ఇక్కడే కొనసాగించాలన రంజిత్‌కుమార్ కోరారు.



సాలూరు రూరల్: దిగువమెండంగిలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



మక్కువ రూరల్: వెంకటభైరిపురంలో తల్లిపాల వారోత్సవాలపై సూచనలిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

గరుగుబిల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి):తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం హెల్త్ విజిటర్ చింతాడ ఉదయకుమారి, గరుగుబిల్లి సెక్టార్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి తెలిపారు. బుధవారం గరుగుబిల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తల్లిపాలువారోత్సవాలు పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించడంతో పాటు పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాముఖ్యత గురించి వివరించారు.తల్లిపాలలో బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన పోషకాలు, విటమిన్లు ఉంటాయన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలుతాగించాలని, ఇవిబిడ్డకు మొదటి సహజటీకా అని పేర్కొన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడంవల్ల తల్లికికూడా అనేక ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీవర్కర్లు పల్ల కృష్ణవేణి, మహంతి పద్మావతి, మూడడ్ల స్వాతి పాల్గొన్నారు.

●సాలూరు రూరల్,ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువమెండంగిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళాపోలీస్ అనూష, వైద్యసిబ్బంది పుష్ప, విమల,మాణిక్యం బాలింతలకు తల్లిపాల అవశ్యకత వివరించారు. అనంతరం గ్రామంలో తల్లిపాలపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు.

●మక్కువ రూరల్,ఆగష్టు6(ఆంధ్రజ్యోతి):మండలంలోని వెంకటభైరిపురంలో పాచిపెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజరు పి.రాజశ్రీ ఆధ్వర్యంలోని తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. పుట్టిన బిడ్డకు ఆరునెలల వరకు తల్లి పాలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరస్వతి పాల్గొన్నారు.

నారుకు నీరేదీ?

(5వ పేజీ తరువాయి)

పెరుగుతుంది. భవిష్యత్తులో కలుపు నివారణకు అధిక మొత్తంలో ఖర్చుచేయాల్సి వస్తుందని రైతులు లబోదిబోమంటున్నారు. మరికొంతమంది రైతులు అందుబాటులో ఉన్న చెరువులు, వాగులు, గెడ్డల ఉంచి ఇంజన్ల సాయంతో పంటలకు నీటిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. కాగా జిల్లాలోని తోటపల్లి ప్రాజెక్టు పాత ఎడమ, కుడి ప్రధాన కాలువల పరిధిలో శివారు భూములకు సాగునీరు అందడం లేదు. ఒట్టిగెడ్డ, జంఝావతి, వెంగళరాయ సాగర్ తదితర ప్రాంతాల శివారు ఆయ కట్టు రైతుల పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది.

ఇబ్బందులు పడుతున్నాం

ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో సాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు. తోటపల్లి కాలువ శివారున ఉన్న మా భూములకు నీరందడం లేదు. తడి లేక పంట భూములు బీటలు వారుతున్నాయి.

- నేరేడుబిల్లి ప్రసాద్, పీఆర్‌రాజుపేట

పనులు చేయలేకపోతున్నాం..

ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో పాటు ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు నాట్లు వేసే మేము ఎండ తీవ్రతకు పనులు చేయలేక పోతున్నాం. మధ్యాహ్న సమయానికి ఇంటి బాట పడుతున్నాం.

- సుగుణమ్మ, ఓని, పాలకొండ మండలం

స్త్రీశక్తికి గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. ప్రస్తుతం నెలకు సుమారు రెండు లక్షల 50 వేల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. ఈ సంఖ్య మూడు లక్షలు దాటే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు అంచనా. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల జిల్లాలో ఆర్టీసీకి నెలకు రూ.కోటి 20 లక్షలు అదనపు భారం పడే అవకాశం ఉందని జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

ఆనందంగా ఉంది..

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం చంద్రబాబునాయుడు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం ఎంతో ఆనం దంగా ఉంది. పార్వతీపురం నుంచి విజయనగరం వెళ్లాలంటే కనీసం రూ.200 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇకపై ఆ పరిస్థితి ఉండదు.

- కె.జ్యోతి, గృహిణి, పార్వతీపురం

డబ్బులు ఆదా..

రామభద్రపురంలో కూరగాయలు కొనుగోలు చేసుకుని పార్వతీ పురంలో విక్రయిస్తుంటా. నాకు వచ్చే ఆదాయం రూ.300 నుంచి రూ.500 వరకు ఉంటుంది. ఇందులో రూ.వంద వరకు బస్సు చార్జీలకే పోతుంది. ఇకపై ఆ పరిస్థితి ఉండదు. ప్రభుత్వం నిర్ణయం.. మా లాంటి వారికి ఎంతగానో కలిసొస్తుంది. డబ్బులు ఆదా అవుతాయి.

- కె.లక్ష్మి, కూరగాయల వ్యాపారి, పార్వతీపురం

అధిక దిగుబడులపై అవగాహన

గరుగుబిల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రైతులు అధిక దిగుబడులు సాధించేలా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్‌పాల్ సూచించారు. తోటపల్లి జట్టు కార్యాలయ ప్రాంగణంలో 15 మండలాలకు చెందిన వ్యవసాయ సిబ్బందికి మూడు రోజుల పాటు శిక్షణ నిర్వహించారు. బుధవారం ముగింపు సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. 'రైతులు ఏడాది పాటు సాగు చేసేలా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలి. వ్యవసాయశాఖ, ప్రకృతి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి. రైతులకు మెరుగైన సూచనలు, సలహాలు అందించాలి. ప్రకృతి పద్ధతుల్లో 9 సార్వత్రిక సూత్రాలను క్షేత్రస్థాయిలో అమలుపర్చేందుకు శ్రద్ధ చూపాలి.' అని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి కె.ప్రకాష్ మాట్లాడుతూ.. వరి ఎదలకు సంబంధించి నూతన వంగడాలను సాగు చేయాలన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఎం.శ్రావణ్‌కుమార్‌నాయుడు మాట్లాడుతూ రైతులు అందుబాటులో ఉండే సేంద్రియ విధానాలను అవలంబించాలన్నారు.

పాలకొండ యువకుడు హైదరాబాద్‌లో మృతి

పాలకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక జంగాలవీధికి చెందిన దేవళ్ల సందీప్(24) హైదరాబాద్‌లో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. హోటల్ మేనేజ్ మెంట్ పూర్తిచేసిన సందీప్ ఓ కేఫ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. సమీపంలో నివాసముంటున్నాడు. బుధవారం భవనంపై నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. గాయపడిన ఆయన్ను ఆస్పత్రి తరలిస్తుండగా మృతిచెందినట్లు తల్లిదండ్రులు శంకరరావు, ఉషారాణిలకు సమాచారంఅందింది. విషయం తెలుసుకు న్న కుటుంబ సభ్యులు హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.

గోకులం షెడ్లతో మేలు

సీతంపేట రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గోకులం పథకం కింద పాడిపశువుల కోసం నిర్మిస్తున్న షెడ్ల వల్ల రైతులకు మేలు చేకూరుతుందని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం పీవీ ఈతమానుగూడ, ఆనపకాయలగూడ గ్రామాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో నిర్మిస్తున్న గోకులం షెడ్లను పరిశీ లించారు. నాణ్యతలో రాజీ పడరాదని తెలిపారు. ఒక్కో షెడ్డును రూ.22లక్షలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. వాటిని పాడిరైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో టీడబ్ల్యూ ఈఈ కుమార్, డీఈ నాగభూషణరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

పాలకొండ(వీరఘట్టం), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ జి.కళాధర్ సూచించారు. బుధవారం మండలంలోని గంగంపేటలోని జీటీడబ్ల్యు స్కూల్‌లో విద్యార్థులకు సంకల్పం కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కాకుండా ఉండాలన్నారు.

